ఎండు చేప.. ఉపాధి కేక

- ఉప్పు, ఎండు చేపలకు పెరిగిన గిరాకీ
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- తయారు చేసి ఉపాధి పొందుతున్న మత్స్యకార మహిళలు



ఉప్పాడలో చేపలు ఎండబెడుతున్న మహిళ

కొత్తపల్లి: నియోజకవర్గంలోని ఉప్పాడ ఎండు చేపలకు రోజురోజుకూ గిరాకీ పెరగడంతో మత్స్యకార మహిళలు ఎండు చేపల తయారీపై మొగ్గుచూపుతున్నారు. పచ్చి చేపల కంటే ఎండిచేపల దిగుబడి ఎక్కువగా రావడంతో పలువురు మత్స్యకార మహిళలకు ఉపాధి పెరిగింది. తీరం వెంబడి ఉన్న మత్స్యకార గ్రామాల్లోని పలువురు మహిళలు ఎండిచేపలు తయారు చేస్తున్నారు. గతంలో అవిరిపట్టడం ద్వారా ఎండి చేపలను తయారు చేసేవారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాండ్‌లు అమర్చి వాటిపై మెస్ వేసి చేపలను ఎండబెట్టేవారు. స్టాండ్ కింద పోగ పెట్టడం ద్వారా వర్షాకాలంలో సైతం చేపలను ఎండబెట్టేవారు. ప్రస్తుతం ఆ పద్ధతి మరుగన పడడంతో ఎండాకాలంలోనే ఎండు చేపల తయారీ ఎక్కువగా జరుగుతోంది.

తీరం నుంచి ఇతర దేశాలకు..

మండలంలోని తీర గ్రామాలైన ఉప్పాడ, మూలపేట, అమీనాబాద, సుబ్బంపేట, మాయాపట్నం, కోనపాపపేట తదితర గ్రామాల్లో ఎండు చేపలు తయారు చేస్తుంటారు. ఎక్కువగా మత్స్యకార మహిళలు ఎండు చేపలు తయారుచేసి తాటాకు బుట్టల్లో పార్శిల్ చేసి ఇక్కడ నుంచి కేరళ, బెంగళూరు, ఒడిశా, కోల్‌కత్తా, చెన్నై తదితర ప్రాంతాలకు లారీల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. గొరస, కోనెం, పండుగప్పలు, వంజరం వంటి ఎండు చేపలను విశాఖ ఎయిర్ పోర్టు నుంచి ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేస్తుండడంతో ఎండు చేపల వ్యాపారం ద్వారా విదేశీ మారక ద్రవ్యం లభిస్తోంది. తీర గ్రామాల్లోని 4, 5 కుటుంబాలకు చెందిన వారు నెలకు సుమారుగా 3 టన్నుల ఎండు చేపలను తయారు చేస్తారు.

ఉప్పుచేపల తయారీ ఇలా..

ఎండు చేపల మాదిరిగానే ఉప్పుచేపలకు గిరాకీ పెరుగుతోంది. పచ్చి చేపలను కొనుగోలు చేసిన మత్స్యకారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొట్టెల్లో ఉప్పు నీటిలో చేపలను వేసి ఊరబెడతారు. తరువాత వాటిని ఎండబెడతారు. వాటిని ప్రత్యేకమైన బుట్టల్లో పార్శిల్ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఎండు చేప, ఉప్పుచేపలు ఎంత కాలమైనా నిల్వ ఉండడంతో వీటికి బాగా గిరాకీ పెరిగింది. ఈ ప్రాంతాల నుంచి రోజుకు సుమారు 5 టన్నుల వరకూ ఎండు, ఉప్పు చేపలు ఎగుమతి అవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



చేపలను సర్దుతున్న మత్స్యకారుడు



ఎండు చేపలను బుట్టల్లో సర్దుతున్న దృశ్యం

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎండు చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించాలి. చేపలను ఎండబెట్టుకునేందుకు అవసరమైన ఫ్లాట్ ఫారాలను నిర్మించాలి. వర్షాకాలంలో చేపలు తడవకుండా భద్రపరుచుకునేందుకు అవసరమైన టార్పాలిన్లు ఇవ్వాలి.

డి. పెంటయ్య, ఎండుచేపల వ్యాపారి ఉప్పాడ

వేసవిలో మంచి డిమాండ్



వేసవికాలం వచ్చిందంటే ఎండు చేపలకు గిరాకీ పెరుగుతుంది. కేజీ రూ.70నుంచి రూ.400 వరకూ విక్రయిస్తాం. జల్ల చేపలు, పార చేపలు, పండుగప్పలకు అధిక డిమాండ్ ఉంటోంది. వేట నిషేధ సమయంలో చేపలు లేక ఉపాధి కోల్పోతున్నాం. ఇటువంటి సమయంలో చేపలు నిలువ చేసేందుకు అవసరం అయిన ఐస్ బాక్సులను ప్రభుత్వం అందించాలి. వేట సాగించే మత్స్యకారులకు ఇచ్చే మత్స్యకార భరోసాను తమకు వర్తించేలా చేయాలి.

వంకా కాశమ్మ, ఎండుచేపల తయారీదారురాలు ఉప్పాడ

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గోర్సలో గడపగడపకూ మన ప్రభుత్వం



గోర్సలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్రంలో అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలో గొర్సలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల రూపంలో కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలుకు శ్రీకారం చుడుతున్నాయని తెలిపారు. గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిసున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు.అనంతరం గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంగల వీరబాబు, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వ్యవసాయ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, పార్టీ నాయకులు వాసంశెట్టి ఆదినారాయణ, వెలిగట్ల శ్రీనివాస్, పూజ్యం సతీష్ బాబు, గంధం అన్నవరం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని గోర్సలో మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్‌కు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అన్ని గ్రామాల్లోనూ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు.

మహిళా ప్రగతితో రాష్ట్రాభివృద్ధి

- ప్రతి మహిళా ఒక వ్యాపార వేత్త కావాలి
- వైఎస్సార్ ఆసరాలో దవులూరి దొరబాబు



జి.మేడపాడులో మహిళా సంఘాలకు నమూనా చెక్కు అందజేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: మహిళా ప్రగతితోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. అందుకే ముఖ్యమంత్రి జగన్ మహిళలకే అన్ని పథకాలు అందజేస్తున్నారని ఆయన అన్నారు. శనివారం జి.మేడపాడు, జి.కొత్తూరు గ్రామాల మహిళా సంఘాలకు సర్పంచ్ పటాని దేవి అధ్యక్షతన ఆసరా లబ్ధిని లబ్ధిదారుల అకౌంట్లలో వేశారు. ఏపీఎం జి.ప్రశాంతి మహిళా సంఘాల ప్రగతిని వివరించారు. దవులూరి దొరబాబు మాట్లాడుతూ జి.మేడపాడులో 156 సంఘాలకు రూ.77,51,513, జి.కొత్తూరులోని 23 సంఘాలకు రూ.19,11,863 జమ అయినట్టు తెలిపారు. లబ్ధిదారులకే నేరుగా పథకాలు అందించడంతో అవినీతికి ఆస్కారం లేదని ఆయన అన్నారు. మహానేత వైఎస్సార్ ప్రతి మహిళలను లక్షాధికారిని చేయాలని సంకల్పించారని, దానిని ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, మండల ఉపాధ్యక్షులు ములసా శ్రీను, పేర్నిడి వెంకట్రాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సంక్షేమ లక్ష్యాలు

- రాష్ట్ర వయోజన విద్యాశాఖ డైరెక్టర్ సూర్యనారాయణ



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న సూర్యనారాయణ

పెద్దాపురం: సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమష్టి కృషితోనే ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి లక్ష్యాల సాధన సాధ్యపడుతుందని సచివాలయాల రాష్ట్ర పరిశీలకుడు, వయోజన విద్య రాష్ట్ర డైరెక్టర్ ఏలూరిపాటి వెంకట సుబ్రహ్మణ్య సూర్యనారాయణ అన్నారు. పట్టణంలో నాగంపేట 14వ వార్డు గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అభివృద్ధి లక్ష్యాల సాధనకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. విద్యకు సంబంధించి డ్రాపౌట్స్ బడిబయట పిల్లలు, 10 నుంచి 19 ఏళ్ల కౌమర బాలికల రక్తహీనత గణాంకాలు, గర్భిణుల గణాంకాలపై ఆరా తీశారు. సచివాలయంలో మహిళా పోలీసుల పాత్రను వివరించారు. కాకినాడ ఉప సంచాలకులు పి.పోశయ్య, వి.త్రిమూర్తులు, సహాయ ప్రాజెక్టు అధికారి పి.రాజేష్, అసిస్టెంట్ మేనేజర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ



జల్లూరులో మట్టి నమూనాల సేకరణపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏఓ అచ్యుతరావు

పిఠాపురం: మట్టి నమూనాల సేకరణ ద్వారా భూసారం తెలుసుకుని అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వినియోగించేందుకు వీలు కలుగుతుందని పిఠాపురం మండల వ్యవసాయాధికారి అచ్యుతరావు అన్నారు. జల్లూరులోని పంట పొలాల్లో మట్టి నమూనాల సేకరణపై శనివారం వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన శాఖ సహాయకులు, పట్టు పరిశ్రమ సహాయకులకు మట్టి నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది వ్యవసాయ రైతుల సమక్షంలోనే మట్టి నమూనాలు సేకరించాలన్నారు. మట్టిని పరీక్షించిన తరువాత భూసారం, భూస్వభావం, సమస్యాత్మక భూములు వివరాలను రైతులకు వివరించాలన్నారు. ప్రతి పంట భూమికి ఏటా క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలన్నారు. భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వీఏఏలు, వీహెచ్‌ఏలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ ఉన్న రకాలు సాగు చేయండి

రైతులకు వ్యవసాయ శాఖ కమిషనర్ సూచన



మేడపాడులో రైతులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ్‌కుమార్, ఇతర అధికారులు

సామర్లకోట: ప్రభుత్వం బొండాలు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నదని, అయితే వ్యవసాయాధికారులు సూచించిన రకాలను రైతులు సాగు చేసుకోవాలని వ్యవసాయశాఖ కమిషనర్ హెచ్ అరుణ్ కుమార్ అన్నారు. జిల్లాలో బొండాల సాగు అధికంగా జరిగిందనే ప్రచారం మేరకు బొండాల దిగుబడిని పరిశీలించడానికి ఆయన జి. మేడపాడు గ్రామంలోని పంట పొలాలకు చేరు కున్నారు. ఈ సందర్భంగా అచ్చట సొసైటీ అధ్యక్షుడు పాలచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో బొండాలను పండించవద్దని చెప్పినా మళ్లీ ఎందుకు వేశారని కమిషనర్ ప్రశ్నించారు. ఎకరానికి 60 నుంచి 65 బస్తాల దిగుబడి రావడంతో ఎక్కువగా బొండాలను పండిస్తున్నామని రైతులు తెలిపారు. సన్నాలు 45 నుంచి 50 బస్తాల దిగుబడి వస్తుందన్నారు., దీనికి తోడు బొండాల కంటే ముందుగానే పంట కోతకు వస్తుందని చెప్పారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రకాలను పండించుకోవాలని అరుణ్‌కుమార్ వారికి సూచించారు. జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు బొండాల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నదని కమిషనర్ తెలిపారు. జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియా, సివిల్ సప్లయ్స్ డీఎం పుష్పమణి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టరు ప్రఖార్ జైన్, వ్యవసాయశాఖ ఏడీఏ జీవీ పద్మశ్రీ, టెక్నికల్ ఏఓ గాయత్రిదేవి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేదుల



బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

పెద్దాపురం: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేదుల సుబ్రహ్మణ్యం తొమ్మిదో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాదే నరసింహారావు, సారా రామచంద్రరావు, తాండ్రోతు నూకరాజు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వేదుల సుబ్రహ్మణ్యం (మణి), ఉపాధ్యక్షుడు చొక్కాకుల రవిబాబు, జనరల్ సెక్రటరీ కందుల నరేష్‌కుమార్, కోశాధికారిగా దేవులపల్లి రవికుమార్, జాయింట్ సెక్రటరీగా మడికి రాంబాబు, లైబ్రరీ సెక్రటరీగా రాగం కామేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా శిలపరశెట్టి విశాలాక్షి, లేడి రిప్రజంటేటివ్‌గా బొర్రా విజయలక్ష్మి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఏవీ జనార్దన్, దేవులపల్లి రామచంద్రారావు, పిట్ల రమణ, సుకురు దుర్గారావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జమ్మి వెంకట కృష్ణారావు, కొండ్రు సతీష్, కె.సూర్యప్రభ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని న్యాయవాదులు అభినందించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని గోర్స గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు కొతాని వెంకట అప్పారావు, పెదిరెడ్ల వీరాస్వామితో పాటు పెదిరెడ్ల కాశీ, పలువురు టీడీపీ నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే దొరబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీ కుమార్, సర్పంచ్ రొంగల వీరబాబు, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దిశ సెంటర్‌కు అనంతపురం యువతి



దిశ సెంటర్‌కు యువతిని అప్పగించిన రైల్వే మహిళా పోలీసు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై ఉన్న యువతిని రైల్వే పోలీసులు కాకినాడ దిశ సెంటర్‌కు అప్పగించారు. రైల్వే ఎస్సై బి.లోవరాజు కథనం ప్రకారం శనివారం ఉదయం స్టేషన్‌లో విధులకు హాజరైన సమయంలో ఆన్‌లైన్‌లో ఒక వ్యక్తి అనంతపురం నుంచి ఫోన్ చేసి తన చెల్లెలు తళ్లరి సాయి కీర్తన రెండు వారాల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిందని, అయితే కొంత మంది ప్రయాణికుల ద్వారా తన చెల్లెలు సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫాంపై ఉన్నట్లు సమాచారం వచ్చిందని రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వాట్సప్‌లో వచ్చిన ఫోటో మేరకు ఎస్సై తన సిబ్బందితో ఆ యువతిని గుర్తించి పేరు సాయికీర్తనగా తెలుసుకున్నారు. దాంతో ఆమె తల్లిదండ్రులకు తెలియపరిచామని ఎస్సై తెలిపారు. తల్లిదండ్రులు వచ్చే వరకు మహిళా సంక్షేమ విభాగం సంరక్షణలో ఉంచేలా చర్చించి దిశ సెంటర్‌కు పంపినట్టు తెలిపారు.

క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు 108 ఉద్యోగి విన్నకోట సురేష్ తెలిపారు. షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 6.30 నుంచి వైద్య శిబిరం ఉంటుందన్నారు.

ఆపద మిత్రలకు కిట్ల పంపిణీ



ఆపద మిత్రలకు కిట్ల పంపిణీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

పెద్దాపురం: ఆపద మిత్ర శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లు, ఆశ కార్యకర్తలకు శనివారం కలెక్టర్ కృతికా శుక్లా గుర్తింపు కార్డులు, కిట్లు అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజలకు అండగా సేవలు అందించాలని సూచించారు. కాకినాడ జిల్లా నుంచి 150 మంది సామర్లకోటలోని విస్తరణ శిక్షన కేంద్రంలో ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో 12 రోజుల పాటు శిక్షణ అందించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక, రెడ్‌క్రాస్ తదితర విభాగాలతో పాటు రెవెన్యూ, పోలీస్ తదితర సమన్వయ శాఖల భాగస్వామ్యంతో ఆపద మిత్ర శిక్షణ ఇచ్చారు. డీపీఎం కిరణ్మయి, ట్రైనింగ్ సెంటర్ ఫ్యాకల్టీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి దర్శనానికి శనివారం భక్తులు బారులు తీరారు. దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామిని అలంకరించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం సుమారు 3,80,400 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. పట్టణంలోని లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం సుమారు వెయ్యి లీటర్ల మజ్జిగను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

ఉపాధి పనులు ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని అమరవిల్లిలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను శనివారం కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ ప్రారంభించారు. ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి ఏపీఓ రాజబాబు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.11.42 కోట్ల విలువ గల పనులను ఇప్పటికే గుర్తించామన్నారు. గ్రామాల్లో పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఉపాధి కూలీలు అందరికీ గుర్తింపు కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఈఓపీఆర్డీ భాస్కర్, సర్పంచులు పులి జయబాబు, పాలాని దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

కొత్తపల్లి: స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద వేంచేసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన 3 వేల మంది పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఎంపీడీఓగా అబ్రహం లింకన్



ఎంపీడీఓ అబ్రహం లింకన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఈఓపీఆర్డీ భాస్కరరావు

కొత్తపల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా వి.అబ్రహం లింకన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా విశ్రాంతిలో ఉన్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఈఓపీఆర్డీగా పని చేస్తున్న భాస్కరరావు ఇంచార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. ఎంపీడీఓ అబ్రహం లింకన్‌ను పలు శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎంపీడీఓ తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మేడిశెట్టి వెంకటరమణ గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. బాధితుడిని శనివారం కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు పరామర్శించారు. బాధితుడికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు అందించిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, ఉపసర్పంచి మేడిశెట్టి శ్రీరాములు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



జీవన్ నగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పట్టణంలోని జీవన్‌నగర్‌లో మాదిగ చర్మకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ చర్మకుల సంక్షేమానికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ చర్మకుల సంక్షేమ సంఘం నాయకులు ఎ.డేవిడ్, వి.రమేష్, సతీష్, నాగేశ్వరరావు, ఎ.రాజకుమార్, ఏడిద రాము తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కొత్తపల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే దొరబాబు సూచించారు. పిఠాపురానికి చెందిన శ్రీసంస్థానం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇచ్చే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ కరపత్రాన్ని మండలంలోని గోర్సలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 18 నుంచి పాత బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఆది, శనివారాల్లో విద్యార్థులు తమ వివరాలను నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు.

వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ

సామర్లకోట: మండల పరిధిలోని జి.మేడపాడు గ్రామంలో శనివారం సాయంత్రం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు వైఎస్సార్ విగ్రహన్ని ఆవిష్కరించారు. పార్టీ అభిమానులు కనుబుద్ది నాగరాజు, బొండా బాబురావు, గవర వీరభద్ర రావు, పాలిక శ్రీను, ముమ్మిడి దేవుడు బాబు, నానిపల్లి సన్యాసిరావులు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

పెద్దాపురం: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో అపరాలు, పచ్చిరొట్ట సాగుపై శనివారం వీఏఏ, వీహెచ్‌ఏ టెక్నికల్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయాధికారి కె.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి పంటకు సైతం పంట నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచామని, దీనిపై రైతులకు అవగాహన ఏర్పర్చాలన్నారు. అలాగే అక్కడి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశువైద్యాధికారి తోట నవీన్ మాట్లాడుతూ సమీకృత దాణా, పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు అంశాలపై ఏఓ సంజయ్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కేఎస్‌వి ప్రసాద్, మాదబోయిన చిలకమ్మ ఆయా గ్రామాల వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: పదహారో నంబరు జాతీయ రహదారిపై గొల్లప్రోలు మండలం చెందుర్తి సెంటర్లో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన పల్లా సింహాద్రి వన్నెపూడిలోని ఒక జ్యూస్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి ఫ్యాక్టరీలో పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా చెందుర్తి సెంటర్‌కు వచ్చే సరికి గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రౌన్‌పేటలో ముగ్గులు, వ్యాసరచన పోటీలు

సామర్లకోట: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని బ్రౌన్‌పేటలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులు అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేశారు. 4వ వార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలలో ఇప్పటికే వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొంటారని చెప్పారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పిఠాపురం: మండలంలోని నర్సింగపురం ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అబ్బురపరిచాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న రైజ్ కార్యక్రమంలో ప్రత్యేక శిక్షణ పొందిన విద్యార్థులు ఇంగ్లిషులో ప్రదర్శించిన లఘు నాటకాలు అలరించాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.నాగేశ్వరరావు, ఎంపీటీసీ కె.అర్జునుడు, రాంబాబు, వైఎస్సార్ సీపీ నేత వులవల భూషణం, ఓలేటి నాగిరెడ్డి, రాయుడు చాందిని, పీఎంసీ చైర్మన్ కె. అప్పలరాజు, ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.